# అమ్మ ఉత్తరం

డా. కె. పద్మలత

**ఆ రోజు ఉదయం పదిగంటలకు ఆఫీసులో ఎండిగారి గది నుండి బయటకు వచ్చిన శివానికి చాలా సంతోషంగా అనిపించింది.**

**'అమ్మయ్య...దాదాపు ఏడెనిమిది నెలల నుండి రెస్ట్‌లెస్‌గా వర్క్ చేస్తే ప్రాజెక్ట్ వర్క్ పూర్తయింది. రిపోర్ట్స్ సబ్మిట్ చేసినప్పుడు ఎండీగారు కూడా చాలా సంతోషంగా ఫీలయ్యారు.**

**ఆయనకు తను హార్డ్‌వర్క్ చేస్తానని, ఇతరుల విషయాల్లో జోక్యం కల్పించుకోదని మంచి అభిప్రాయం ఉంది. బహుశా ఫ్యూచర్‌లో ఇంకా పెద్ద ప్రాజెక్టులు అప్పగిస్తారేమో' అనుకుంది.**

శివాని తన క్యాబిన్‌లోకి వచ్చి రిలాక్స్‌డ్‌గా కూర్చుంది. మళ్లీ సడెన్‌గా లేచి విండోగ్లాసెస్ జరిపి రోడ్డువైపు చూసింది. వాళ్ల ఆఫీసు ఆరో అంతస్తులో ఉండడం చేత క్రింద హడావుడిగా రకరకాల వాహనాల పైన వెళ్తున్న జనం కనిపిస్తున్నారు.

ఆఫీసు టైం కావడంతో రోడ్డంతా బిజీగా ఉంది.

'అబ్బ... ఇంత ప్రశాంతంగా నిలబడి ఈ పరిసరాలను గమనించి ఎన్ని రోజులయిందో! రోజూ ఉదయం ఎనిమిది గంటలకే రావడం, ఈ కంప్యూటర్ ముందు గంటల తరబడి కూర్చోవడం... రాత్రి ఎనిమిది గంటలవరకు తలెత్తకుండా పని, ఆకలిపిస్తే ఏవైనా తెప్పించుకుని తినడం, లేకపోతే మిషన్‌లా వర్క్ చేయడం... బాబోయ్ తలచుకుంటే అంత వర్క్ తనే కంప్లీట్ చేసిందా? అనిపిస్తుంది. మొత్తానికి ఏమైతేనేం కనీసం ఒక పదిహేనురోజుల వరకూ తను ప్రశాంతంగా ఉండొచ్చు' అనుకుంది.

శివాని మళ్లీ తన సీట్‌లోకొచ్చి కూర్చుంది. 'నిజానికి తను ప్రశాంతంగా ఉండగలిగే పరిస్థితిలో లేదు. ఓ వైపు అమ్మ ఆరోగ్యం బాగాలేదు. మరో వైపు విచ్ఛిన్నమవుతున్న సంసార జీవితం. ఎటూ తేల్చుకోలేని గందరగోళ పరిస్థితి. ఇంక తను ప్రశాంతంగా ఎలా ఉండగలదు? అవన్నీ తలచుకుంటేనే గాబరాగా అనిపిస్తుంది' నిట్టూర్చింది శివాని.

ముందు తను ఎండిగారి పర్మిషన్ తీసుకుని రెండు మూడురోజులు లీవ్ తీసుకుని వెళ్లి అమ్మను చూసి రావాలి. దాదాపు రెండు నెలల నుండి అమ్మ తనను చూడాలని ఫోన్ చేస్తోంది. ఎందుకో ఈ వారంరోజుల నుండి ఫోన్ కూడా లేదు. బిజీగా ఉండడం చేత తను కూడా ఫోన్ చేయలేకపోయింది. అమ్మ ఎలా వుందో?' అనుకుంది.

ఆమె ఆలోచనల్లో ఉండగానే ఇంటర్‌కమ్ ఫోన్ రింగయింది. శివాని ఫోనెత్తి "హలో" అంది.

"హలో మేడమ్! గుడ్‌మార్నింగ్. ఐయామ్ అనూష."

"గుడ్‌మార్నింగ్ అనూషా! ఎనీ కాల్ ఫర్ మి" ఆత్రుతగా అడిగింది. ఏ మూలనో సిక్స్త్ సెన్స్ ఏదో ప్రమాదాన్ని సూచిస్తోంది.

"ఎస్ మామ్! దేరీజ్ కాల్ ఫ్రం విజయవాడ. ఐ విల్ కనెక్ట్ ఇట్."

శివాని గుండె వేగంగా కొట్టుకుంటోంది. రెండ సెకన్ల తరువాత ఫోన్‌లో "హలో చిన్నీ! నేను బాబ్జి అన్నయ్యను. బాగున్నావా?"

"హలో అన్నయ్యా! బావున్నాను. మీరందరూ ఎలా ఉన్నారు? ముఖ్యంగా అమ్మ ఎలా ఉందో చెప్పు" ఆమెకు చాలా ఎక్సైటింగ్‌గా ఉంది.

"అది చెప్పాలనే ఫోన్ చేస్తున్నాను. మేమందరం బాగానే వున్నాము కానీ పెద్దమ్మకే చాలా సీరియస్‌గా ఉంది. నువ్వు వెంటనే రావాలి. బిజీగా ఉన్నానని మానేయకు."

"అన్నయ్యా! అమ్మకేమయింది?" వణుకుతున్న గొంతుతో అడిగింది.

"నువ్వు ముందు బయలుదేరిరా. మిగతా విషయాలు తరువాత"

ఫోన్ డిస్‌కనెక్ట్ అయింది.

శివాని నిరుత్తరురాలిలా కూర్చుండిపోయింది. కళ్ల నుండి నీరు కారిపోతున్నాయి. 'అనుకున్నదంతా అయింది. అమ్మను ప్రాణాలతో చూడలనో లేదో'

ఇంతలో డోర్ తీసుకుని లోపలికి వచ్చి స్రవంతి ఆమెను చూసి "ఏయ్ శివా! వా హాప్పెన్డ్?"

శివాని మాట్లాడలేదు. కానీ స్నేహితురాలు ప కరించడంతో మనసులోని బాధను కక్కేసినట్లు ఒక్కసారిగా ఏడ్చేసింది.

"ఏయ్ ఏంటది చిన్నపిల్లలా. చెప్పు. ఏం జ గింది?" ఆత్రుతగా అడిగింది.

శివాని విషయం చెప్పగానే "అరే... అయా సారీ శివా! అయినా అమ్మకేం కాదు. బాగా వుంటుంది. నువ్వు వెంటనే బయలుదేరు. ఎండిగ రికి నేను చెప్తానులే" అని కంప్యూటర్ దగ్గరకు వెళ్లి ఫాస్ట్‌గా ఏదో మ్యాటర్ ఫీడ్ చేసి ప్రింటవుట్ తీసి శివాని దగ్గరకు తీసుకువచ్చి "సిగ్నేచర్ చేయి. లీ అప్లికేషన్. నేనిస్తానులే. నువ్వు తొందరగా వెళ్ళు సేఫ్‌గా వెళ్లగలవా? నేను రానా?" అనడిగింది.

"థాంక్యూ స్రవంతీ! అక్కర్లేదు. నేను వెళ్లగ లను" అని హేండ్ బ్యాగ్ తీసుకుని బయటకొచ్చింది.

గంట తరువాత ట్రైన్‌లో కూర్చున్న శివాని మనసంతా అల్లకల్లోలంగా ఉంది. ఆమె ప్రక్కనే ఆమెకు వరుసకు మామయ్య సుందరంగారు కూర్చున్నారు.

బెంగుళూరులో ఆమెకున్న ఏకైక బంధువు ఆయనే. అందుకే రూంకి వెళ్లగానే ఆయనకు ఫోన్ చేసి విషయం చెప్పింది. ఆయన కూడా వస్తాననడంతో ఇద్దరూ బయలుదేరారు.

"ఇంతకూ ఆ మహానుభావుడికి ఈ విషయం చెప్పావా శివా! అయినా చెప్పినా అతనెందుకు వస్తాడులే. బాధ నీకుగానీ అతనికి కాదుగా" నిష్ఠూరంగా అన్నాడు.

శివాని మాట్లాడలేదు. దీపక్‌కి ఇన్‌ఫర్మేషన్ ఇవ్వాలని సెల్‌కి ట్రై చేస్తే ఆఫ్ చేసి ఉంది. బహుశా ఏదైనా మీటింగ్‌లో వున్నాడేమో! ఆ విషయం సుందరంగారికి చెప్పాలనిపించలేదు. అందుకే మౌనంగా ఉంది.

మళ్లీ అతనే "అసలు ఆఖరురోజుల్లో మీ అమ్మకు మనశ్శాంతి లేకుండా చేసింది అతనే కదమ్మా. నీ జీవితంతో ఆడుకున్నాడు. మిమ్మల్నింతగా బాధపెట్టి అతడేం బావుకుంటాడులే" అన్నాడు.

"మామయ్యా! ప్లీజ్ కాసేపు నన్ను ఒంటరిగా వదిలేయండి. ఇప్పుడా విషయాలను ఆలోచించవలసిన అవసరంలేదు" శివాని విసుగ్గా అని వెనక్కి వాలి కళ్ళు మూసుకుంది.

ఆమె మొహం చూసి ఏమనుకున్నాడోగానీ "మీరెందాకా వెళ్తున్నారు మాస్టారు" అంటూ ఎదు

రుసీట్లో కూర్చున్నతనితో మాటలు కలిపాడు.

శివాని కళ్లముందు అమ్మ రూపం కదలాడు తోంది.

ఒకరకంగా చూస్తే ఆఖరురోజుల్లో అమ్మకు మనశ్శాంతి లేకుండా చేసింది తనే.

రెండు నెలల నుండి తనను చూడాలని ఉందన్నా వెళ్లలేకపోయింది. పదిరోజుల క్రితం ఫోన్ చేసినప్పుడు అమ్మ గొంతు బలహీనంగా వినిపించింది.

"శివా! నీతో కొంచెం మాట్లాడాలి. ఒక్కసారి రా తల్లీ" ఎంతో రిక్వెస్టింగ్‌గా అడిగింది.

"కంపెనీ అప్పగించిన ప్రాజెక్ట్ వర్క్ లాస్ట్‌స్టేజ్‌లో ఉందమ్మా. ఇప్పుడు రావడం కష్టం. ఆ వర్క్ అయిపోగానే వెంటనే వస్తాను. నామీద కోపం తెచ్చుకోకమ్మా. మందులు రెగ్యులర్‌గా వాడు" అంది.


"నీ ఇష్టం" అంది అమ్మ. కానీ ఆ గొంతులో ఏదో బాధ వున్నట్లు తను గ్రహించింది.

'అసలు అమ్మ తనతో ఏం మాట్లాడాలనుకుందో! బహుశా దీపక్ గురించే అయి వుంటుంది. ఇప్పుడు తను వెళ్లేసరికి అమ్మ ఏ పరిస్థితిలో వుంటుంది? తనతో మాట్లాడగలుగుతుందో లేదో! భగవంతుడా! అమ్మతో మాట్లాడే అవకాశం కల్పించు' కళ్ల నుండి జారిపడుతున్న నీళ్లను తుడుచుకుంది.

అమ్మకు తనంటే ప్రాణం. ఇద్దరు మగపిల్లల తరువాత పుట్టిందని ఎంతో గా ఆ బ ం గా చూసారు. అన్నయ్యలకన్నా తనే అమ్మనాన్నలతో ఎక్కువ చనువుగా ఉండేది.

'శివా' అన్న అమ్మ పిలుపులో ఎంతో ఆప్యాయత.

'ఏయ్ కోమలీ! నువ్వీ మధ్య నన్ను సరిగ్గా పట్టించుకోవట్లేదోయ్' అచ్చు నాన్న అన్నట్లే అంటే 'నీకీమధ్య పొగరెక్కువ అయింది' అని మురిపెంగా నవ్వుతూ మందలించేది.



'అమ్మమ్మ నీకంత మంచి పేరు పెట్టింది కదా. నువ్వేంటి నాకీ పేరు పెట్టావు' అని దెబ్బలాడితే 'తప్పురా అలా అనకూడదు. ఆడపిల్ల పుడితే అమ్మవారి పేరు పెట్టుకుంటానని మొక్కుకున్నాను. అందుకే ఆ పేరు పెట్టాను. అయినా నీ పేరుకేంటి చక్కటి పేరు' అనేది.

హైదరాబాద్‌లో ఎంసిఎలో సీట్ వస్తే తనతోపాటు అమ్మ కూడా ఇల్లు తీసుకుని వుంది. పాపం ఆ రెండు సంవత్సరాలు నాన్న చాలా ఇబ్బంది పడ్డారు.

బెంగుళూరులో జాబ్ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తనే రెండు మూడు పెద్ద కంపెనీలలో జాబ్స్‌కి అప్లై చేసింది. లక్కీగా ఈ కంపెనీలో జాబ్ దొరికింది. మంచి జీతం, అన్ని ఫెసిలిటీస్ ఉన్న జాబ్. వదులుకోలేక పోయింది.

అందుకే అమ్మ వద్దంటున్నా వినకుండా జాయిన్ అయిపోయింది. అమ్మ తనకోసం చాలా చేసింది. తను అమ్మకోసం ఏమీ చేయలేకపోయింది. ఆ ఫీలింగ్ తనను చాలా బాధపెడుతోంది అనుకుంది.


## చింపాంజీ అసూయ

ఆస్ట్రియాలోని వియన్నాలో బోన్‌బ్రన్ జూలో నోంజా అనే చింపాంజీ చక్కగా పెయింటింగ్ చేస్తోందని తెలిసి వాటిని కొనుక్కోవడానికి జనాలు క్యూలు కడుతున్నారట. ఆ జూలో 1950లో జానీ అనే చింపాంజీకి మొదట్లో పెయింటింగ్‌లో ట్రైనింగ్ ఇచ్చారుట. అప్పట్నుంచీ అక్కడ చింపాంజీ పెయింటింగ్స్ ప్రసిద్ధికెక్కాయి. అయితే క్లాడిమెర్ అనే చింపాంజీ నోంజా వేసిన చిత్రాల్ని కొన్నింటిని చింపేస్తోందిట. నోంజా అంత బాగా చిత్రాలు గీయలేకపోయిన వ్లాడిమెర్ అసూయతో అలా చేస్తోందంటున్నారు.

## దొరికిపోయిన దొంగ

రుమేనియాలో ఫగారాస్ అనే ఊళ్ళో ఓ రాత్రి మండాచే అనే అతని షాపులో దొంగ దూరాడు. 250 డాలర్లు కొట్టేసి బయటకి వెళ్లబోతూ అద్దాల కేసులోని కేక్‌ని చూసి నోరూరి అక్కడ తిష్ట వేసుకుని కడుపారా ఆరగించాడట. తరువాత షాపులోంచి పారిపోబోతే కిటికీలో దూరలేకపోయాడు. అసలే స్థూలకాయం. అంత కేక్ తినేసరికి పాపం అటో కాలు ఇటో కాలుతో కిటికీలో ఇరుక్కుపోయాడట. ప్రొద్దుటే షాపు యజమాని వచ్చి చూస్తే ఇది అతని అవతారం. కడుపు బద్దలయ్యేలా నవ్వుకుని ఆ తరువాత పోలీసుల్ని పిలిచాడు.

-తటవర్తి




***

విజయవాడలో ట్రైన్ దిగి ఆటోలో ఇల్లు చేరేసరికి ఇంటిముందున్న జనాన్ని, నిశ్శబ్ద వాతావరణం చూసి శివానికి విషయం అర్థమైపోయింది. కాళ్లు చేతులు వణుకుతున్నాయి. అక్కడే నిర్ఘాంతపోయి నిలుచున్న ఆమెను బాబ్జీ అన్నయ్య చేయి పట్టుకుని కోమలి శవం దగ్గరకు తీసుకెళ్లాడు. నిర్జీవంగా కనిపిస్తున్న తల్లిని చూసి శివాని కుప్పకూలిపోయింది. తల్లి పాదాలపై తల ఆన్చి భోరుమని ఏడ్చింది.

ఆమెను చూసి వదినలు కూడా కన్నీళ్ళు పెట్టుకున్నారు. తల్లిని చూసి శివాని ఆశ్చర్యపోయింది. 'నాలుగు నెలల్లోనే అమ్మలో ఎంత మార్పు! ఆ చేతులు పుల్లల్లా అంత సన్నగా ఉన్నాయేంటి? గుండె జబ్బు మనిషిని ఇంతగా కృంగదీస్తుందా?' అనుకుంది.

***

మూడురోజుల తరువాత శివాని ఒంటరిగా ఇంటి వెనకాల వున్న వేపచెట్టు క్రింద కూర్చుంది. అసలు ఈ మూడురోజులుగా ఆమె ఎవరితోనూ సరిగ్గా మాట్లాడలేకపోతోంది.

ఏదో తప్పు చేసిన ఫీలింగ్ ఆమెను బాధ పెడుతోంది. తల వంచుకుని కూర్చున్న ఆమె ఎండుటాకులపై అడుగుల శబ్దం వినిపించి తలెత్తింది. తండ్రి చేతిలో ఏదో కవర్ పట్టుకుని వస్తున్నాడు. ఏముందందులో?

ఆయన శివాని పక్కన కూర్చుని "ఏమ్మా! ఒక్కదానివే ఇక్కడ కుర్చున్నావేంటి" అన్నారు.

తండ్రిని చూసి శివాని 'ఈ మూడురోజుల్లో నాన్న చాలా కృంగిపోయారు. కానీ పైకి మాత్రం ధైర్యంగా వున్నట్లు కనిపిస్తున్నారు' అనుకుంది.

"శివా! మీ అమ్మ గురించి నువ్వు చాలా బాధపడుతున్నావని నాకు తెలుసమ్మా. అది సహజం కూడా. కానీ మీ అమ్మ చనిపోతుందని నాకు ముందే తెలుసు. ఎవ్వరికీ చెప్పలేక నాలో నేను ఎంత కుమిలిపోయానో..." ఆయన గొంతు పూడుకునిపోయింది.

"క్షమించండి నాన్నా. మీ బాధను షేర్ చేసుకోలేకపోయాను. చివరిరోజుల్లో అమ్మకు సేవ చేయాల్సిందిపోయి కనీసం ఆమెను చూసి మాట్లాడలేకపోయాను. అది నన్ను చాలా బాధ పెడుతోంది."

"మీ అమ్మ చివరిరోజుల్లో నీ గురించి చాలా బాధపడింది. నీతో ఎన్నో విషయాలు మాట్లాడాలనుకుని చాలాసార్లు ఫోన్ చేసింది. కానీ ఏదో అర్జంట్ వర్క్ వుందని నువ్వు రాలేకపోయావు. అందుకే తను నీతో మాట్లాడాలనుకున్నవన్నీ ఈ ఉత్తరంలో వ్రాసింది. నీకొక విషయం తెలుసా శివా! శరీరం పూర్తిగా బలహీనమైపోయి ఎక్కువసేపు కూర్చోలేని పరిస్థితిలో కూడా ఆమె దాదాపు నాలుగైదు రోజులు కష్టపడి రోజూ కొంచెం చొప్పున ఈ ఉత్తరం స్వయంగా తనే వ్రాసింది. ఇది రాయడానికి ఆమె చాలా కష్టపడింది."

"అమ్మా!" శివాని తండ్రి ఒడిలో తల పెట్టుకుని వెక్కి వెక్కి ఏడ్చింది. "అమ్మా! నేను స్వార్థపరురాలిని. నన్ను క్షమించమ్మా!"

"శివా! ఏడవకమ్మా. అది మీ అమ్మకు సంతోషాన్నివ్వదు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలంటే ఈ ఉత్తరంలో మీ అమ్మ ఏం వ్రాసిందో చదివి అర్థం చేసుకోవడానికి ప్రయత్నించు. అంతకన్నా నేనేం చెప్పలేను" అంటూ ఉత్తరం ఆమె చేతిలో ఉంచి వెళ్లిపోయారు.

శివాని కళ్ళు తుడుచుకుని కవర్‌లో నుండి ఉత్తరం తీసి చదవడం ప్రారంభించింది. తనకు బాగా పరిచితమైన, ఇష్టమైన ముత్యాల్లాంటి అక్షరాలు. ఆ అక్షరాలను ప్రేమగా తడిమింది.

"శివా! ఇది నీకు నేను వ్రాస్తున్న ఆఖరి ఉత్తరమని నాకు తెలుసు. మనసు


విప్పి నీతో చాలా మాట్లాడాలనుకున్నాను. కానీ ఆ అవకాశం దొరకలేదు. నీకున్న బిజీ షెడ్యూల్ మూలంగా నువ్వు నా దగ్గరకు రాలేకపోయావు. నేనేమీ అపార్థం చేసుకోవడంలేదురా. నువ్వే కాదు, ప్రస్తుత పరిస్థితుల్లో తమ కాళ్ల మీద తాము నిలబడాలని, అందరూ చూసి ఈర్ష్యపడేలా ఏదో సాధించాలనే తాపత్రయంలో చాలామంది యువతీ యువకులు నువ్వున్న పరిస్థితిలోనే ఉన్నారు. అందులో తప్పులేదు కూడా. ఈ రోజుల్లో ఆడపిల్లలకు కూడా ఆర్థిక స్వాతంత్ర్యం అవసరమే నాన్నా. అందుకే నాకిష్టం లేకపోయినా మంచి జాబ్ కోసం నువ్వు బెంగుళూరు వెళ్తానంటే కాదనలేకపోయాం. ముందు నుండి కూడా ఏదైనా లక్ష్యాన్ని సాధించడానికి నువ్వు బాగా కష్టపడుతున్నావని, నీ అవసరాలను కూడా సరిగా పట్టించుకోవని నాకు తెలుసు. అందుకే నువ్వు ఉద్యోగంలో చేరిన తరువాత బాధ్యతలలో కూరుకుపోయినప్పుడు అప్పుడే పెళ్లి చేసుకుంటావేమోనని దిగులుపడ్డాను. కానీ చిత్రంగా నీ అంతట నువ్వే మీ కంపెనీలోనే పని చేస్తున్న దీపక్ నిన్ను పెళ్లి చేసుకుంటానంటున్నాడని, నీకు కూడా పెద్దగా అభ్యంతరం కనిపించడంలేదని చెప్పినప్పుడు సంతోషంగా నీ పెళ్లి చేసాము. కానీ నీ వైవాహిక జీవితం ఇలా భగ్నమై పోతుందను కోలేదు.

శివా! దీపక్ నన్ను కలసి అన్ని విషయాలు చెప్పాడు. తన తొందరపాటుకు, నీ మీద చేయి చేసుకున్నందుకు అతడు చాలా పశ్చాత్తాపపడుతున్నాడు. నా దృష్టిలో అతడు పెద్ద తప్పేం చేయలేదు. రాకరాక వాళ్ల అమ్మగారు, అక్కయ్య వస్తే నువ్వు సరిగ్గా పట్టించుకోలేదని, రాత్రి తొమ్మిదింటికి ఇంటికి వచ్చి హోటల్ నుండి భోజనం ఎందుకు తేలేదని విసుక్కున్నావని, ఆ సందర్భంలో మాటా మాటా పెరిగి నీపైన చేయి ఎత్తాడని చెప్పాడు. ఏ మగవాడైనా కొత్త సంసారాన్ని చూడడానికి వాళ్లవాళ్ళు వస్తే తన భార్య బాగా మర్యాదలు చేయాలని, వాళ్లు తన భార్యను మెచ్చుకుంటే సంతోషపడాలని అనుకుంటాడు. కానీ నువ్వు ఆఫీస్ వర్క్‌లో పడి వాళ్లను పట్టించుకోకపోతే వాళ్లెలా ఫీలయివుంటారు? అందుకే అతడు బాగా హర్ట్ అయి ఉండాలి.

చిన్నా! ఎవరికైనా కెరీర్‌తోపాటు ఆరోగ్యం, సంసారం కూడా ముఖ్యమే. అదే కంపెనీలో పని చేస్తున్న అతడు ఆరుగంటలకు ఇంటికొస్తే నువ్వేదో సాధించాలనే తాపత్రయంలో ప్రాజెక్ట్ వర్క్‌లు పైన వేసుకుని తొమ్మిది పది దాకా పని చేస్తున్నావనీ, దానివల్ల నీ ఆరోగ్యం పాడవుతుందని అతడు బాధపడుతున్నాడు. ఇంట్లో జరిగిన చిన్న గొడవకే ఇల్లు వదిలి స్నేహితురాలి రూములో చేరడం మొదటి తప్పయితే, నీ సమస్యను సుందరం మామయ్యతో చెప్పుకుని వాడి సలహా తీసుకోవడం రెండో తప్పు. వాడు డబ్బు కోసం ఏదైనా చేసే దుర్మార్గుడమ్మా. లేకుంటే మీ భార్యాభర్తల మధ్య తలెత్తిన చిన్న తగాదాను ఆసరాగా తీసుకుని విడాకులకోసం నిన్ను ఎంకరేజ్ చేసాడంటే అందులో వాడి స్వార్థాన్ని అర్థం చేసుకోవచ్చు. నిన్ను దీపక్ నుండి శాశ్వతంగా దూరం చేసి మెల్లగా నీ మీద పెత్తనం సంపాదించవచ్చునని, నీ డబ్బును వాడుకోవచ్చునని వాడి దురాశ.


శివా! రెండునెలలక్రితం నువు తల్లివి కాబోతున్నావని ఫోన్ చేసినప్పుడు సంతోషపడాలో, బాధపడాలో అర్థంకాలేదు. భర్తతో విడాకులు తీసుకోవాలనుకుని, అతని ద్వారా ఊపిరి పోసుకున్న బిడ్డను కని పెంచాలనుకుంటున్నావు. నువ్వు నిజంగా దీపక్‌తో విడిపోవాలనుకుంటే ఇప్పుడైనా అబార్షన్ చేయించుకో. అదేంటి అమ్మ ఇంత దారుణమైన సలహా ఇస్తోంది అనుకుంటున్నావా? నాకు ఆ చిన్నారిపై ప్రేమ లేక కాదురా. ఈ సమాజంలో తండ్రికి దూరంగా ఉంటున్న బిడ్డను లోకం ఎంత హీనంగా చూస్తుందో నాకు తెలుసు. అదీగాక పిల్లలు తల్లిదండ్రులిద్దరి ఆదరణలో పెరిగినప్పుడే సంపూర్ణ వ్యక్తిత్వాన్ని పొందుతారు. తండ్రికి దూరంగా ఉండి తల్లి రోజంతా ఆఫీసు వర్క్‌తో బిజీగా ఉంటే ఆ పాపాయి ఎంతో ఒంటరితనాన్ని అనుభవించాల్సి వస్తుంది. మానసికంగా కూడా ఎదగకపోయే ప్రమాదం కూడా వుంది. అందుకే పాపాయి భవిష్యత్తును ఊహించే అబార్షన్ చేయించుకోమంటున్నాను. అప్పుడు నువ్వు సంసార జంజాటాలేమీ లేకుండా జాబ్ మీదనే కాన్‌సన్‌ట్రేట్ చేయవచ్చు. ఒక టీచర్‌గా నేను పని చేసిన పదిహేను సంవత్సరాలలోనూ ఎంతోమంది పిల్లల్ని గమనించాను కాబట్టి ఈ విషయాలన్నీ వ్రాయగలుగుతున్నాను.

"చిన్నా! ఒక్క విషయం గుర్తుంచుకో. మనిషికి ఎప్పుడో ఒకప్పుడు ఖచ్చితంగా తనకంటూ ఒక మనిషి తోడుంటే బాగుండుననిపిస్తుంది. నువ్వు కూడా దానికి అతీతం కావు. ఒంటరితనం బాధపెడుతుంటే నీకు దీపక్, పాపాయి గుర్తొచ్చి బాధపడతావు. తప్పు చేసానని పశ్చాత్తాపపడతావు. ఆ పరిస్థితి రాకుండా ఉండాలంటే దీపక్‌తో మాట్లాడి మళ్లీ సంసార జీవితాన్ని ప్రారంభించు. అతడు నిన్ను ఆహ్వానించడానికి సిద్ధంగానే ఉన్నాడు. అప్పుడు నీకు అబార్షన్ చేయించుకునే అవసరం ఉండదు. నీ పాపాయి అమ్మానాన్నలతో కలసి హాయిగా పెరుగుతుంది. ఆ దృశ్యం ఊహించుకుంటే నాకెంత హాయిగా ఉందో! నీకిష్టంలేని పని చేయమని నిన్ను బలవంతపెట్టను. కానీ నీ జీవితానికి



## అంతరంగం

తారల మాటలు విచిత్రంగా ఉంటాయి. ఆరేళ్లక్రితం సినిమాల్లోకి వచ్చిన అందాలసుందరి సుస్మితాసేన్ కెరీర్‌లో ఎన్నో ఒడిదుడుకుల్ని ఎదుర్కొంది. ఎన్ని చిత్రాల్లో నటించినా, ఎంత పారితోషికం తీసుకున్నా ప్రేక్షకుల అభిమానం ముందు అవి దిగదుడుపే అంటోంది సుస్మితాసేన్. 'నా సినిమా టీవీలో వస్తున్నప్పుడు అభిమానుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్ నాకెంతో సంతృప్తిని ఇస్తాయి' అంటున్న సుస్మితాసేన్ ఓ హాలీవుడ్ సినిమాలో నటించే ఛాన్స్ కొట్టేసినట్టు భోగట్టా.



అత్యంత అవసరమైన విషయాన్ని తొందరపాటుతనంతోనూ, సుందరం మామయ్యలాంటివాళ్ల ప్రోద్బలంతోనూ కాకుండా నీకు నువ్వుగా ఆలోచించి నిర్ణయం తీసుకో. ఏది ఏమైనా నీ జీవితం సుఖవంతం కావాలనే నేను కోరుకుంటున్నాను.

శివా! తల్లిగా నేనిచ్చే సలహా ఒక్కటే. నీకు కెరీర్ ఎంత ముఖ్యమో సంసారం కూడా అంతే ముఖ్యం. అందుకే సాధ్యమైనంతవరకూ ఆ రెండింటినీ బ్యాలెన్స్‌డ్‌గా మెయిన్‌టెయిన్ చేయడానికి ప్రయత్నిస్తే సుఖపడతావు. ఇప్పుడూ, ఎప్పుడూ నీ సుఖాన్ని కోరే

నీ అమ్మ

ఉత్తరం చదవడం పూర్తయింది. శివాని కళ్లనుండి రెండు నీటి చుక్కలు రాలి ఉత్తరం మీద పడ్డాయి. 'ఆఖరి రోజుల్లో తన సంసార జీవితం గురించి అమ్మ ఎంత క్షోభ పడిందో ఈ ఉత్తరం చదివితే తెలుస్తుంది. ఒక్కసారి వీలు చూసుకుని వస్తే ఇంకా చాలా విషయాలు మాట్లాడేదేమో! ఇప్పుడు తనేం చేయాలి?

శివాని ఆ రోజంతా నిద్రపోకుండా ఆలోచిస్తూనే వుంది.

★★★

ఉదయం ఏడుగంటలకే గబగబా రెడీ అయి బయటకు వస్తున్న శివానిని వాళ్ల అన్నయ్య "అదేంటమ్మా... ఇప్పుడెక్కడికి ప్రయాణం? పదకొండవ రోజువరకు ఉండవా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"మొన్న అనుకోకుండా వచ్చేసాను కదన్నయ్యా. అర్జంటుగా చేయాల్సిన పనులున్నాయి. అవి పూర్తి చేసుకుని మళ్లీ వస్తాను" అని తండ్రివద్దకు వెళ్లి "నేను మళ్లీ రెండు మూడురోజుల్లో వస్తాను నాన్నా" అంది.

ఆయన మౌనంగా తలూపారు.

"శివానీ! నేను మాత్రం ఇక్కడెందుకు? నేనూ నీకు తోడుగా వస్తాను" అన్నాడు సుందరంగారు.

"మీ తోడు నాకు ఇప్పుడు అవసరంలేదు మామయ్యా. మీరిక్కడే ఉండండి" కఠినంగా చెప్పి బయటకు వచ్చేసింది.

★★★

బెంగుళూరు చేరుకోగానే శివాని ప్రయాణ బడలికను కూడా పట్టించుకోకుండా దీపక్ సెల్‌కు ఫోన్ చేసింది.

"హలో దీపక్ స్పీకింగ్" అవతలి గొంతు వినగానే శివాని గుండె వేగంగా కొట్టుకుంది.

"దీపక్...నేను..."

వాక్యం పూర్తి కాకుండానే అతడు "అయాం సారీ శివా. అమ్మ చనిపోయిందని తెలిసి బాధపడ్డాను. రావాలనుకున్నాను కానీ అక్కడ నన్నందరూ విలన్ లాగా చూడడం, అదీగాక ఏదైనా గొడవలైతే బాగుండదు. అందుకే రాలేదు. కానీ చివరిరోజుల్లో మనం ఆమెను ప్రశాంతంగా ఉండనీయకపోయామన్న విషయమే నన్ను బాధపెడుతోంది" నిజాయితీగా అన్నాడు.

"దీపక్! నేను మనింటికి వచ్చేయాలనుకుంటున్నాను. నీకేమైనా అభ్యంతరమా?"

"భలేదానివే. ఆ మాట నువ్వెప్పుడు అంటావా అని ఎదురు చూస్తున్నాను. అయితే ఒక్క విషయం. గతాన్ని ఇద్దరం మరచిపోదాం. మళ్లీ కొత్త జీవితాన్ని ప్రారంభిద్దాం" అన్నాడు హుషారుగా.

★★★

దాదాపు ఎనిమిది నెలల తరువాత ఒళ్లో చిన్న పాపాయితో శివాని, ఆమె పక్కనే దీపక్ పీటలపై కూర్చుని ఉన్నారు. మూడోనెలలో పాపాయికి నామకరణం చేస్తున్నారు.

"బాబూ! మీముందు పళ్లెంలో ఉన్న బియ్యంలో ఉంగరంతో పాపాయికి ఏం పేరు పెట్టాలనుకుంటున్నారో రాయండి" అన్నాడు పురోహితుడు.

దీపక్ వెంటనే ఉంగరంతో పళ్లెంలోని బియ్యంలో "కోమలి" అంటూ రాసాడు.

తనవైపు అదోలా చూస్తున్న తల్లితో "అమ్మా! ఈరోజు మనందరం ఇంత సంతోషంగా ఉండడానికి కారణం ఆవిడ వ్రాసిన ఉత్తరమే కదా. అందుకు కృతజ్ఞతగా మా పాపాయికి ఆవిడ పేరు పెట్టుకుందామనుకుంటున్నాను" అన్నాడు.

శివాని మనసులో 'ఔను. అమ్మ ఉత్తరం వల్లే ఈ రోజు ఇంత సంతృప్తిగా ఉన్నాము. బహుశా ఈ రోజు అమ్మ ఆత్మకు కూడా శాంతి కలుగుతుంది' అనుకుంది.

★

## రూమర్ల రాజ్యం



సినిమా ఇండస్ట్రీలో నిజంకంటే రూమర్లకే అధిక ప్రాధాన్యత ఉంటుంది. తాజాగా బాలకృష్ణ హీరోగా నటిస్తున్న కొత్తచిత్రంలో నటిస్తున్న సదా ఆ ప్రాజెక్ట్ నుంచి వైదొలుగుతున్నట్టు వార్తలొచ్చాయి. 'ఇదంతా రూమరే. నేను ఆయన పక్కన నటిస్తే చిన్నదానిలా కన్పిస్తానని అన్నారంతా. అయితే నేను నటించడానికి సిద్ధమయ్యాను. నటనలో చిన్నతనం, పెద్దతనం కాదు మనకి లభించిన పాత్రల్ని సద్వినియోగం చేసుకోవడం ముఖ్యం అంటూనే తానీ సినిమా నుంచి బయటికి వెళ్లలేదు అంటూ వివరణ ఇస్తోంది సదా.

